# ఇది జీవితం

## శ్రీమధుర్‌జీ

మోడరన్ సినీ స్టూడియో

స్టూడియోలో పదవ ఫ్లోర్‌లో కోలాహలంగా వుంది లైట్ బాయిస్, అసిస్టెంట్లు, కెమరామన్, ఆర్ట్‌డైరక్టర్, ఎక్స్‌ట్రా ఆర్టిస్టులు, యితర వర్కర్లు ఫ్లోర్‌లోని సెట్టింగులూ యిటూ అటూ పరుగులు తీస్తున్నారు 'షాట్'కు సిద్ధం చేస్తూ




ఆరోజు దివ్యకళానికేతన్ వారి సంచలన సాంఘిక చిత్రం 'శీలవతి' కోసం క్లైమాక్స్ దృశ్యాల చిత్రీకరణ గురించి టెక్నీషియన్స్, ఆర్టిస్ట్స్ హడావుడి పడిపోతున్నారు

ఉదయం పదిగంటలు

ప్రఖ్యాత దర్శకుడు రాంచందర్‌గారి కారు స్టూడియోలోకి మలుపు తిరిగి, పదవ ఫ్లోర్ పోర్టికోలో హుందాగా ఆగింది. డైరక్టర్ రాంచందర్‌గారు వాచీ చూసుకుంటూ హడావుడిగా కారు దిగి ఫ్లోర్‌లోకి అడుగుపెట్టారు

యాభై ఏళ్ళు పైబడిన రాంచందర్‌గారి ముఖంలో తెలివితేటలు, హుందాతనం తెలుగుదనం కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి దర్శకుడిగా తెలుగు చిత్రరంగంలో మహోన్నత శిఖరాల నందుకున్నారు ఇక సంచలన నవలా రచయితగా రాంచందర్‌గారు అందుకోని బహుమానం, పొందని గౌరవ పురస్కారం మిగలలేదన్న అతిశయోక్తి కాదు రాంచందర్‌గారు మనిషిగా ఎంతటి సెమ్యుడో దర్శకునిగా అంతటి నిక్కచ్చి మనిషి తను మనసులో భావించుకున్న ఎఫెక్ట్స్ వచ్చేంతవరకు తను వూపిరి పీల్చుకోరు ఆర్టిస్టులను, టెక్నీషియన్లకు వూపిరి పీల్చుకోనివ్వరు చిత్రీకరణలో ఎక్కడా రాజీ దొరకని, లొంగుబాటును, మెతకతనమును ప్రదర్శించరు కాబట్టే రాంచందర్‌గారిని ఉత్తమ దర్శకునిగా ఇటు పరిశ్రమ గౌరవిస్తుంది అటు ప్రజలు ఆదరిస్తున్నారు

'గుడ్ మార్నింగ్ సర్ '

'నమస్కారం సార్'

'నమస్తే! సర్ '

ఆర్టిస్ట్‌ల, టెక్నీషియన్ల నమస్కారాలందుకొంటూనే ' షాటుకు ఏర్పాటు చేసిన హంగులను పరిశీలించారు ఎఫెక్ట్స్ కోసం కొన్ని మార్పులు, చేర్పులు సూచించి – తదనుగుణంగా సరంజామా మార్పించారు కథా రచయితతో, మాటల రచయితతో పది నిముషాలు చర్చించి సంభాషణలను తను చెప్పదల్చుకున్న భావాలకు అనుగుణంగా సరిదిద్దుకున్నారు తీయదలుచుకున్న షాట్ గురించి హీరోయిన్‌కు తగు

సూచనలిచ్చారు తను కోరుకుంటున్న ఎఫెక్టుకు అనుకూలమైన యాంగిల్స్ గురించి కెమరామెన్‌తో చర్చించారు

షాట్ రడీ

సైలెన్స్ ' రాంచందర్‌గారి కంఠం ఖంగున మ్రోగింది ఫ్లోర్‌లోని హడావుడి మాయమై – నిశ్శబ్దం రాజ్యం చేసింది

'స్టార్ట్ '

లైట్లు వెలిగాయి కెమరా పని చెయ్యటం ప్రారంభమయ్యింది

శీలవతివి నీవమ్మా
అనురాగవతివి నీవమ్మా

బ్యాంక్ గ్రౌండ్ నుంచి పాట అలా అలా వినిపిస్తోంది గాయిని గొంతునిండా పలికించిన కరుణరసం రేపు ప్రేక్షకులచే కన్నీరు కార్పిస్తుంది పాట కనుగుణంగా హీరోయిన్ హిమబిందు బరువుగా కదులుతోంది. భారంగా అడుగులు వేస్తోంది గ్లిసరిన్ కన్నీరు హీరోయిన్ చెంపల మీదుగా ధారాపాతంగా కారుతున్నాయి జుట్టు చెదిరి, కట్టు చెదరి, చీరనలిగి, బ్రతుకు చిరిగి హీరోయిన్ దయనీయంగా వుంది ప్రేక్షకుల సానుభూతిని, జాలిని యిట్టే చూరగొనేలా వుంది

ధనానికన్నా ఈ జగానమిన్న
శీలమె కద తల్లీ
ప్రాణం కన్నా పదిలమైనదీ
శీలమె కద చెల్లీ

పాటలో చరణాలు కదిలిపోతున్నాయి నీలినీడల నడుమ –వెలుగు చీకట్ల నడుమ దిగివచ్చిన దైన్యంలా, రూపుకట్టిన దీనత్వంలా హీరోయిన్ కన్నీటితో – కొడగట్టిన దీపంలా సాగిపోతూ వుంది దూరంగా స్మశానంలో చితిమంటలు చుట్టూ భయంకర నిశ్శబ్దం కరడుకట్టిన అంధకారం

ఆ నీరవ నిశీథిలో దగాపడిన ఆడపడుచు మొండిగా నడిచి వెడుతూంది ఆరని కన్నీటితో, చెదరిన గుండెతో, మంటగలసిన శీలంతో

ఈ లోకం పామై కాటేసిందే తల్లీ ఈ సంఘం
నిలువున దో చేసిందే చెల్లీ

పాటలో చరణం మారింది
తెగిన గాలిపటానికి గమ్యం ఏదమ్మా
పగిలిన నావకు యిక తీరం ఏదమ్మా

వర్షం మొదలయ్యింది చెట్లు జుట్టు విరియ విరియబోసుకుని దెయ్యం పట్టిన వానిలా ఊగుతున్నాయి ఆకాశంలో ఉరుముల ఫెళ ఫెళలు

కళ్ళు చెదరగొట్టే మెరుపులు ఏర్లు, వంకలు వాగులు ప్రవాహాలుగా పెరుగుతున్నాయి అయినా హీరోయిన్ నిర్లక్ష్యంగా, నిద్రలో నడిచేదానిలా నిర్వికారంగా కన్నీళ్ళతో నడుస్తోంది

అదిగదిగో ఆకాశం నిను పిలుస్తున్నది
పొంగి పొరలు జలపాతం నిను రారమ్మన్నది
రా కదలిరా రా రా కదలిరా
రా రా రా రా

హీరోయిన్ మీదుగా సుళ్ళు తిరిగే ప్రవాహం ఆపైన భయంకర నిశ్శబ్దం పాట ఆగిపోయింది

'కట్ ఓ కే రాంచందర్‌గారి కంఠం ఖంగుమంది హీరోయిన్ హిమబిందు ముఖం తుడుచుకుంటూ వచ్చింది

'వెల్‌డన్ బిందూ! ఈ సీన్లో నీ యాక్షన్ సూపర్బ్ నాకే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయంటే నమ్ము ' రాంచందర్‌గారు హీరోయిన్‌ను అభినందించారు

'థాంక్స్ సర్ నాదేముంది మీరు వ్రాసిన పాటకు మీరు క్రియేట్ చేసిన వాతావరణానికి సహజంగానే ఆ బలముంది ' హీరోయిన్ వినయంగా జవాబిచ్చింది

మళ్ళీ సెట్లో కోలాహలం మొదలయ్యింది

'నాన్నా . '

రాంచందర్‌గారు ఆ పిలుపు విని వెనుదిరిగారు.

నీరజ! రాంచందర్‌గారి ఏకైక పుత్రిక నీరజ కళ్ళ నిండా కన్నీరు

'ఎప్పుడొచ్చావమ్మా యివ్వాళ కాలేజీ లేదా తల్లీ –'

'యివ్వాళ నాకు క్లాసు వర్క్ లేదు నాన్నా మీరు ఈ క్లైమాక్స్ సీను మొదలెట్టే వేళకే వచ్చాను మీరు వర్క్ మీద వున్నారు కనుక డిస్టర్బ్ చెయ్యలేదు '

'ఎలా వచ్చిందమ్మా ఈ సీను '

'బాగుంది నాన్నా కానీ –' అర్ధోక్తిలో ఆగింది నీరజ

'ఏమ్మా మధ్యలోనే ఆగిపోయావేం అడుగు తల్లీ –' రాంచందర్‌గారు ఆప్యాయంగా కూతురు తల నిమిరారు.

'ఈ షాట్‌లో హీరోయిన్‌ను ప్రవాహంలో కలిపెయ్యకుండా వుంటే బాగుండేదేమో ' నీరజ గొణిగినట్లుగా అడిగింది

'నో '– రాంచందర్‌గారి కంఠం నిండా స్థిరత్వం

'ఆమె తప్పుకు అదే తల్లీ తగిన పరిష్కారం –'

'ఆమె తప్పు చెయ్యవలసి వచ్చిన పరిస్థితులను కూడా చక్కగా చూపారు కదా నాన్నా అయినా కూడా 'సందిగ్ధంలో ఆగింది

'తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పేకదమ్మా నిప్పును చేత్తో తగిలి అయ్యో యిది నిప్పని నాకు తెలియదే అంటే ఆ నిప్పు ఆ చేతిని కాల్చక మానుతుందా తల్లీ ' రాంచందర్‌గారి వాదన నీరజకు నచ్చనప్పటికిని ఆ వాదనను ఖండించే శక్తిలేక మౌనం దాల్చింది

'ఏమో నాన్నా ఆ ముగింపు నాకు నచ్చలే దు '

'మనకు నచ్చినా నచ్చకపోయినా ఆ కథకు ఆ ముగింపు తప్పదు తల్లీ –'

ఎందుకో నీరజ హఠాత్తుగా తలెత్తి రాంచందర్‌గారి కళ్ళలోకి చూసింది ఆ కళ్ళలో నీరజకు రాజీ లేని పట్టుదల కన్పించింది తండ్రి కళ్ళల్లోకి చూస్తున్న నీరజ కళ్ళల్లో కన్నీళ్ళు తిరిగాయి


'సార్–' అసిస్టెంటు పిలుపుకు రాంచందర్‌గారు అటు తిరిగారు నీరజ చరచరా ఫ్లోర్ బయటకు వచ్చి కారెక్కింది – కన్నీళ్ళు తుడుచుకుని

నీరజ చెవుల్లో 'శీలవతి' క్లైమాక్స్ సీను తండ్రి వ్రాసిన ఆ పాటే ప్రతిధ్వనిస్తోంది నీరజ సీట్లో వెనక్కు వాలి బలవంతంగా కళ్ళు మూసుకుంది

ఆ కళ్ళ నిండా కన్నీరు

* * * * *

సాయంకాలం ఆరు గంటలు



పశ్చిమాకాశంలో సంజకెంజాయలు ప్రకృతికి వింత వింత సొయగాలు పంచిపెడుతున్న వేళ –

నీరజ బీచ్‌లో అసహనంగా కూర్చుంది క్షణ క్షణానికీ చూపులు రోడ్డు మీదకు పరుగెడుతున్నాయి ఆశగా చెవులు అలవాటుపడ్డ స్కూటర్ శబ్దం కొరకు నిరీక్షిస్తున్నాయి అందమైన ఆ సాయంకాలం దుర్భరంగా వుంది నీరజకు చుట్టూ వందలాది జనం ఆనందంగా ప్రకృతి సొయగాన్ని అనుభవిస్తున్నా నీరజకు మాత్రం ఆ వాతావరణం నిర్లిప్తంగా వుంది ఆ ఏకాంతం దుర్భరంగా వుంది ఆ నిరీక్షణ దుస్సహంగా వుంది

అయినా నిరీక్షిస్తూనే వుంది నీరజ నిరీక్షణ మధుకర్ కోసం అవును మదుకర్ ఎవరో నీరజకు సంవత్సరం క్రితం వరకు తెలియదు మదుకర్ సంవత్సరం క్రిందట సిటీ బాంక్‌కు ఆఫీసర్‌గా వచ్చాడు చిత్రంగా ఓ రోజు – సిటీ బస్‌లో కాలేజీకి వెడుతున్న నీరజకు అదే బస్‌లో ప్రయాణిస్తున్న మదుకర్‌కు పరిచయముయింది

మదుకర్ అందం, వ్యక్తిత్వం, మాటకారితనం, చొరవ, చదువు, వుద్యోగం, ఆర్థిక హోదా అన్నీ అన్నీ ఎంతో నచ్చాయి నీరజకు

నీరజ అందం, ఆకర్షణ, మనసు, వినయం, సోషల్ మూమెంట్, కళాభిమానం, యవ్వనం అన్నీ అన్నీ మరింతగా నచ్చాయి మధుకర్‌కు

అందుకే వారి పరిచయం స్నేహంగా, స్నేహం ప్రేమగా, ప్రేమ ప్రణయంగా కాలగతితో పాటు పరిణామం చెందాయి ఇక మిగిలిందల్లా ప్రణయం పరిణయంగా మారటమే

సంజకెంజాయలు క్రమంగా కనుమరుగై నీలి తెరల్లాటి చీకట్లు ముసురుకుంటున్నాయి బీచ్‌లో సాయంకాలం సందడి నిశ్శబ్దంగా రూపు మార్చుకుంటోంది

అయినా నీరజ యింకా నిరీక్షిస్తోంది

ఆ నిరీక్షణలోని అసహనం స్థానే క్రమంగా భయం, దిగులు, ఆందోళన చోటు చేసుకుంటున్నాయి నీరజ గుండెలు అర్థంకాని బావనలతో బరువెక్కాయి

మద్యాహ్నం సంగతులు నీరజ మనసులోని భయాన్ని పదింతలుగా పెంచుతున్నాయి గత వారం పది రోజుల్నుంచి నీరజ ఒంట్లో నలతగా వుంది శరీరంలో కనిపించని నీరసం దేహంలో తరిగిపోయిన వుత్సాహం పుట్టి బుద్ధెరిగిన తర్వాత ఎన్నడూ లేని క్రొత్తదనం శరీరంలో చోటు చేసుకున్న మానసిక బావన

అందుకే నీరజ మద్యాహ్నం లేడి డాక్టరును కలిసింది డాక్టరుగారు సమగ్రంగా పరీక్షించి చెప్పిన మాటలు చెవుల్లో మళ్లీ మళ్లీ ప్రతిధ్వనిస్తూనే వున్నాయి

' చూడమ్మా యు ఆర్ లక్కీ ఎనఫ్ నీలో మరో జీవి రూపుదిద్దుకుంటోంది .'

# ఇది జీవితం

మరో జీవి తల్లి పెళ్లి కాని తల్లి కన్నెగానే తల్లి

'నో నో అలా జరగటానికి వీల్లేదు వీ ల్లే దు ' బీచ్‌లో కూర్చుని నీరజ పిచ్చి దానిలా పైకే గొణుక్కుంది మధ్యాహ్నమే సిటీ బాంకుకు ఫోన్ చేసి సాయంకాలం ఆరు గంటకు మదుకర్‌ను బీచికి రమ్మని చెప్పింది

బీచిరోడ్డు చర్చిలో ఏడు గంటలు కొట్టారు మధుకర్ స్కూటర్ రోడ్డు ప్రక్కన ఆగింది ఇసుకలో నడిచి తనవైపే వస్తున్న మధుకర్ వైపు తదేకంగా చూసింది నీరజ మధుకర్ కన్నుల్లో కాంతి తప్ప కపటం కనబడలేదు నీరజకు ఆ చిరునవ్వుల్లో వెన్నెల తప్ప నీలి నీడలు కనబడలేదు నీరజకు

నో నా మదు నన్నెప్పటికీ మోసం చెయ్యడు గొణుక్కుంది

సారీ నీరజా! బాగా లేటయ్యింది సాయంకాలం ఐదింటికి రీజనల్ మేనేజర్ రావటంతో బాగా ఆలశ్యమయింది సారీ ఫర్‌ది ట్రబుల్ " వినయంగా సంజాయిషీ చెప్పుకున్నాడు మధుకర్ నీరజ మధుకర్ కళ్లలోకి పిచ్చిదానిలా చూస్తోంది ఆ కనురెప్పల వెనుక దుముకటానికి సిద్ధంగా వున్నాయి కన్నీళ్లు

మధూ ' నన్ను మోసం చేయవుగా నీరజ గుండెల్లోని దుఃఖం ఒక్కసారి కెరటంలా ఎగిసి వచ్చింది బేలగా ఏడ్చింది

నీరజా ఏమిటిది ఇప్పుడేమయిందని ప్లీజ్ కిల కిల నవ్వే నీ కన్నుల్లో ఆ కన్నీళ్లు చూడలేను ప్లీజ్ కంట్రోల్ యువర్‌సెల్ఫ్ .' లాలనగా నీరజ వీపు నిమిరాడు నీరజ మదుకర్ చేతిని తన చేతుల్లోకి తీసుకుని కన్నీళ్లు తుడుచుకుంది

నీరజా ఏం జరిగిందో వివరంగా చెప్పు

నీరజ తన తలను మధుకర్ గుండెల్లో దాచుకుని వెక్కిళ్లమధ్య చెప్పింది తను తల్లి కాబోతున్న విషయం

ఈజిట్ ' నవ్వుతూ అడిగాడు మధుకర్

అమాయకంగా తలూపింది నీరజ

'డోన్ట్ ఫియర్ డియర్ ఈ మధుకర్ ఎప్పుడూ నీవాడే పోనీ రేపు మీ నాన్నగారిని కలిసి వీలయినంత త్వరగా మన పెళ్లికి ముహూర్తాలు నిర్ణయించమని చెప్పనా చిరునవ్వుతో అడిగాడు

నీరజ ముఖంలో కోటి దివ్వెల వెలుగులతో పాటు బుగ్గలపై చిరుసిగ్గుల అరుణిమలు విరబూశాయి

నీరజ ఆనందంగా తలూపింది మధుకర్ చేతులు నీరజను మరింత దగ్గరగా చేర్చుకున్నాయి

★ ★ ★ ★

కళాభారతిలో రాచందర్‌గారి సన్మాన సభ. సంచలన రచయిత రాంచందర్‌గారి నవల "అబల కు కేంద్ర సాహిత్య అకాడమీ వారు బహుమతి ప్రకటించిన సందర్భంగా– సాహిత్య సంఘాలు, అభిమానులు సంయుక్తంగా నిర్వహిస్తున్న అభినందన సభ

వేదిక మీద నగర మేయర్, ప్రధాన న్యాయమూర్తి, ప్రముఖ సినీ నటులు, దర్శకులు, అనన్య ప్రచారంగల ఓ వారపత్రిక సంపాదకులు– వారి మధ్యన నిలువెత్తు పూలమాలలతో రాంచందర్‌గారు ఆసీనులైవున్నారు

సభ మొదలయ్యింది వేదిక నలంకరించిన ప్రముఖులు తమ ఉపన్యాసాల్లో రచయిత రాంచందర్‌గారి ప్రతిభను, వారి రచనా విధానాన్ని, వారి ప్రాభవ వైభవాల్ని పదే పదే ప్రస్తుతించారు నవలలోని యితివృత్తాన్ని, దాన్ని నవలగా మలచిన తీరును మరో వక్త ఆకాశాని కెత్తేశాడు తదుపరి రాంచందర్‌గారిని ఘనంగా సన్మానించారు దర్శక, రచయిత రాంచందర్‌గారు తనకు జరిగిన సన్మానానికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు

నా నవల 'అబల'కు కేంద్ర సాహిత్య అకాడమీ వారు బహుమతి ప్రకటించడం నాక్కూడా ఆనందంగానూ, కొంచం గర్వంగానూ వుంది ఈ బహుమతి నేనూహించిందే నిజానికి 'అబల'లోని కథావస్తువు ఏ బహుమతినైనా గెలువగలిగి నట్టిది ఈ నవల మీరందరూ పదే పదే చదివారు కనుక నేను వివరంగా చెప్పవలసిన పనిలేదు ఈ నవలలోని నాయిక చైతన్యం మూర్తీభవించిన స్త్రీ స్త్రీల ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ స్త్రీ పురుషుల మధ్య నున్న అంతరాల్ని, అసమానతల్ని తొలగించటానికి తీవ్రంగా కృషి చేస్తుంది అలా ఉద్యమాల్లో పనిచేస్తూ, మరో సంస్కర్తయైన ఓ యువకున్ని ప్రేమిస్తుంది ఆ ప్రేమ ప్రణయానికి దారి తీస్తుంది కానీ ఆ యువకుడు మరో సాధారణమయిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు

అప్పుడు ఆ నాయిక స్త్రీలందరి సమస్యల గురించికాక తన సమస్య గురించే ఆలోచిస్తుంది ఆమెలో నున్న చైతన్యం కనుమరుగవుతుంది సంఘ దూషణ, తిరస్కారాలకు గురై సమాజం నుండి వెలివేయ బడుతుంది '

ముందు వరుస ప్రేక్షకుల్లో కూర్చున్న నీరజ తండ్రిగారి ఉపన్యాస ప్రవాహంలో లీనమయింది నీరజ మనసు నిండా రకరకాల ఆలోచనలు ముసురుకుంటున్నాయి

' . అప్పుడు ఆ నాయిక చైతన్యమూర్తి కాదు కేవలం స్త్రీ ఒక అబల ఓ అనాథ అందుకే అందుకే ఆత్మహత్య చేసుకుంటుంది ఈ ఘుగింపు స్త్రీలోకానికి కనువిప్పు కలిగించాలి అప్పుడే నా నవల అబలకు" సార్థకత

చేకూరుతుంది "

హాల్లో చప్పట్లు మారు మ్రోగాయి కాని ఎందుకో నీరజకు ఆ చప్పట్లు చావు బాజాల్లా వికృతంగా వినిపించాయి ప్రేక్షకుల మనస్సులో దాగివున్న పైశాచికత్వం ఆ చప్పట్లలో పరోక్షంగా ధ్వనించినట్లుగా ఫీలయ్యింది నీరజ

సభ ముగిసింది. నీరజ తండ్రి రాంచందర్‌గారితో పాటు కారెక్కింది

"నాన్నా!.... మీ నవల ముగింపును గురించి మీకెవ్వరూ ఏమీ వ్రాయలేదా?"

"ఎందుకు రాయలేదు తల్లీ ... ఎన్నో ఉత్తరాలు వచ్చాయి– ఆ ముగింపు చాల మందికి నచ్చింది ... ముఖ్యంగా అకాడమి పెద్దలు ఆ ముగింపును మరీ మరీ మెచ్చుకున్నారు తల్లీ .."

"మీక్కూడా ఆ ముగింపు.... తృప్తి నిచ్చిందా. . నాన్నా. "

"ముగింపు వ్రాసేటప్పుడు ఎక్కడో అంతరాంతరాల్లో రవ్వంత అసంతృప్తి వున్నా పాఠకులు. పత్రికలు, అకాడమీలు ఆ ముగింపును యింతగా మెచ్చుకున్న తర్వాత ఆ ముగింపు నాక్కూడా తృప్తిగా వుంది తల్లీ. "

నీరజ మౌనంగా తండ్రి ముఖంలోకి చూసింది. నీరజ కనురెప్పల చాటున కదలాడే కన్నీటి ఊటలు ..

* * * *

"హలో ... మధుకర్‌గారు రాలేదా . లీవ్ మరో పదిరోజులు పొడిగించుకున్నారా . ఎక్కడకు వెళ్ళారో చెప్పగలరా . హలో.... యింటర్వ్యూకు వెళ్ళారా అడ్రస్ తెలిస్తే చెప్పగలరా . తెలియదంటారా ... అల్‌రైట్ . థాంక్స్ "

నీరజ నిస్సత్తువగా ఫోన్ పెట్టేసింది

".... ఇప్పటికే మధుకర్ కనిపించి పదిహేను రోజులయ్యింది. మరో పది రోజులు కనిపించదన్న మాట. .. ఇంటర్వ్యూకు వెడుతున్న వాడు మాటవరసకయినా చెప్పకుండా వెళ్ళాడేమిటి యింకా పది రోజులు యిలా కన్నీళ్ళతో. గుండె బరువుతో నిరీక్షించాలా కొంపతీసి మధుకర్ నన్ను. నన్ను మోసం చెయ్యడు కదా ఏమో ?"

ఆ ఊహకే నీరజ గజగజ వణికిపొయ్యింది కళ్ళల్లో నీరు గిర్రున తిరిగి జలపాతాల్లా చెంపల మీద కురికాయి

"నో . అలా ఎన్నటికీ జరుగదు "

మనసులో మళ్ళీ క్రొత్త క్రొత్త ఊహలు తియ్య తియ్యని ఆశలు .

ఆశా నిరాశల నడుమ , భయాల, దిగుళ్ల నడుమ, చీకటి వెలుగుల నడుమ పదిరోజులు ఎలాగో గడప గలిగింది నీరజ

మరుసటి రోజు పదిగంటలకు స్వయంగా మధుకర్ పనిచేస్తున్న సిటీ బ్యాంక్‌కు వెళ్ళింది నీరజ. కాని– మధుకర్ అక్కడ లేదు. చెదిరే మనసును చిక్కబట్టుకొని మధుకర్ గురించిన వివరాలు సేకరించింది నీరజ ఆ వివరాలు నీరజ జీవిత గమనాన్ని తారుమారు చేశాయి. నీరజ మనసున మంటలుగా ప్రజ్వరిల్లి ఆమె బ్రతుకునే బుగ్గిపాలు చేశాయి.

మధుకర్ సిటీ బ్యాంక్‌లోని ఆఫీసర్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు మరో బ్యాంక్‌లో ఎక్కడో జోనల్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించాడట ..! ఎక్కడ పని చేస్తున్నది ఎవరికీ తెలియదట....!

నీరజ కన్నీళ్ళతో బ్యాంక్ బయటకు వచ్చింది.

నీరజకు ప్రపంచమంతా శూన్యంగా వుంది. మనసు నిండా పిచ్చి పిచ్చి భావాలు ముసురుకుంటున్నాయి. ఆకాశం కూడా నీరజ మనసులానే దట్టంగా మబ్బుపట్టి– కురవటానికి సిద్ధంగా వుంది ...

"తను.. . తను.... మోసపోయిందా...."

గొణుక్కుంది.

కడుపులో జీవం పోసుకుంటున్న మరో జీవి 'అవునవు'నని జవాబిచ్చినట్లుగా తోచింది నీరజకు

బ్యాంక్‌కు ఎదురుగుండా 'శీలవతి' చిత్రం తాలూకు నిలువెత్తు నాయిక కటవుట్

ఆ కటవుట్‌ను నీరజ పిచ్చిదానిలా తీక్షణంగా గమనించింది

.. .

నీరజ కన్నుల్లో కన్నీళ్ళు లేవు . అర్థంకాని భావం తప్ప .

* * * *

మోడరన్ స్టూడియోస్‌లోని ప్రివ్యూ థియేటర్‌లో 'శీలవతి' చిత్రాన్ని పత్రికేయులకు, పరిశ్రమలోని ప్రముఖులకు, నగర పెద్దలకు, మేధావులకు చూపిస్తున్నారు దర్శకులు రాంచందర్‌గారు

ఇంటర్వెల్‌లో రాంచందర్‌గారికి ఫోను

"హలో డైరక్టర్ రాంచందర్‌గారా . మీరు వెంటనే విజయ హాస్పిటల్‌కు రండి. మీ అమ్మాయి నీరజ నిద్రమాత్రలు మ్రింగింది కండిషన్ యీజ్ వెరీ సీరియస్.... వెంటనే రండి ..'

"ఆ!!!' – రాంచందర్‌గారు ఫోన్ దగ్గరే కుప్పకూలిపొయ్యారు అందరూ చుట్టుముట్టారు. పరిస్థితి క్షణాల్లో అర్థమయ్యింది 'శీలవతి' చిత్ర ప్రదర్శన అర్థాంతరంగా ఆగిపొయ్యింది. రాంచందర్‌గారి కారు హాస్పిటల్‌కేసి పరుగు తీసింది...

ష్... - "సారీ సర్. మీ అమ్మాయి నీరజ మరణించింది "

"నీరజా . ఆ పిలుపు హాస్పిటల్ అంతటా వెర్రిగా ప్రతిధ్వనించింది రాంచందర్‌గారు నేలమీద కూలిపోయారు

'ఎంతపని చేశావు తల్లీ నీకేం లోటని ఆత్మహత్య చేసుకున్నావు తల్లీ. చెప్పమ్మా


## కావలెను

కృష్ణా, గుంటూరు జిల్లాలలోగల మా కాన్వెంట్స్ బ్రాంచీలలో పని చేయుటకు 10th అర్హతగల టీచర్స్ కావలయును. దరఖాస్తు ఫారంకై స్వంత అడ్రసుగల కవరు పంపండి.

శ్రీ నేతాజి కాన్వెంట్స్ ఆఫీసు,
లక్ష్మీటాకీసువద్ద, సత్తెనపల్లి,
గుంటూరు జిలా . పిన్ : 522403.

## మోడర్న్ ఆర్ట్స్

ఫొటోగ్రఫీ, కలర్ ఫొటోగ్రఫీ, స్క్రీన్ ప్రింటింగ్‌లను ఆధునిక కళలుగా పరిగణించవచ్చును. మా సంస్థ నిపుణుల ద్వారా ఈ అన్ని కళల రహస్యాలు తెలుసుకోండి. ఇవన్నీ కూడా మంచి ఆదాయమును చేకూర్చేవే కాకుండా ఉత్సాహాన్నిచ్చే హాబీలు కూడా.

ప్రాస్పెక్టస్‌కోసం వ్రాయండి :

**Kalaimathi Nilayam (P)**
Nanjai Thalaiyur. 639204,
Periyar Dist., Tamilnadu.

ఆంధ్రపత్రిక
దినపత్రికలో
* మన సినిమాలు
* వింత యదార్థం
శీర్షికలు
చూస్తున్నారా ?

చెప్పు ' పిల్లవాడిలా కూతురు శవంపై పడి ఏడుస్తున్నారు రాంచందర్‌గారు

'సర్ శవం ప్రక్కన ఈ వుత్తరం దొరికింది ఈ పుస్తకంలో ఆ పుస్తకం రాంచందర్‌గారు వ్రాసిన 'అబల' అది నీరజ చివరి వుత్తరం కన్నీళ్ళు తుడుచుకుని రాంచందర్‌గారు ఆ వుత్తరం చదివారు

నాన్నా !

నేను తప్పు చేశాను నా మనసుకు నచ్చిన ఓ యువకునికి మనసివ్వటమన్న తప్పు చేశాను మనసిచ్చిన వానికి మనసిచ్చిన తర్వాత నాకున్నవన్నీ యిచ్చుకున్నాను నన్ను నేనే అర్పించుకున్నాను అప్పుడు తెలిసింది నాన్నా నేను తప్పు చేశానని నా తప్పుకు పలితంగా నా కడుపులో మరో జీవి ఊపిరి పోసుకుంటున్నదని తెలుసుకున్నప్పుడు నే చేసింది యెంతటి తప్పో తెలుసుకున్నాను నాన్నా! కానీ నాన్నా! ఓ దగుల్బాజీ. ఓ మోసగాడు. ఓ వంచకుడు నన్ను నమ్మించి ప్రేమించినట్లు నటించి – మోసం చేసి పారిపోయినపుడు నేను పిరికిదానిలా ఆత్మహత్య చేసుకోకూడ దనుకున్నాను కానీ – నన్ను కని అల్లారు ముద్దుగా పెంచి విద్యాబుద్ధులు చెప్పించిన మీరు మీ రచనల్లో, మీ దర్శకత్వంలో వచ్చిన సినిమాల్లో నా జీవితంలో వచ్చిన యిలాంటి సజీవ సమస్యలకు ఆత్మహత్యలే

## ప్రభాతసూక్తి

మనిషిని
మనిషిగ చూడు
మానవత్వాన్ని
తెచ్చుకో తోడు!
'మంచి'
మనిషికి నీడ!
'నీడ' లేని
బ్రతుకే చీడ!
మాట
మనుగడకు కోట.. !
బీటలు వారితే
నీటి మూట !

–యస్వీకె మల్లిక్

# ఇది జీవితం

పరిష్కార మార్గాలుగా చూపారు అవునా నాన్నా ? పైగా ఆ ముగింపు గురించి నేను మిమ్మల్ని పదే పదే ప్రశ్నించినా ఆ ముగింపే సరైనదనీ మీకు తృప్తి కలిగించినదనీ మీరు చెప్పారు

అందుకే నాన్నా! మీ కూతురు కూడా తన జీవిత సమస్యకు మీరు చూపిన పరిష్కారాన్నే అనుసరించింది నాన్నా శెలవ్

కడసారి నమస్సులతో మీ కూతురు,
నీరజ

ఉత్తరం పూర్తి చేసిన రాంచందర్‌గారు పిచ్చివానిలా అరుస్తూ – కన్నీరు మున్నీరుగా విలపించారు

అమ్మా నీరజా నా కళ్ళు తెరిపించావు తల్లీ సినిమాల్లో, నవలల్లో నేనిచ్చే పరిష్కారాలు వ్యాపారం కోసం తల్లీ పాఠకుల్ని, ప్రేక్షకుల్ని ఏడిపించి సొమ్ము చేసుకుంటున్నాము తల్లీ అమ్మా నీరజా! అవి నవలలు సినిమాలు తల్లీ కాని యిది యిది జీవితమమ్మా జీవితం

రాంచందర్‌గారు వెర్రిగా కేకలేస్తూ తన 'అబల నవలను ముక్కలు ముక్కలుగా చించారు

మరుసటి రోజు –

ప్రఖ్యాత రచయిత, దర్శకుడు నిర్మించిన 'శిలవతి' చిత్రానికి రాష్ట్రపతి అవార్డు

ప్రముఖ పత్రికలన్నీ ఈ వార్తను ప్రముఖంగా మొదటి పేజీలో బాక్సులు కట్టి ప్రచురించాయి

అదే పత్రికల్లో ఓ మూల నీరజ ఆత్మహత్య కూడా అతి మామూలుగా ప్రచురింప బడింది □



★ ఛాంపియన్ లోగో, ఛాంపియన్ అక్షరాల నమూనా, అట్ట పెట్టె ట్రేడ్ మార్క్, మరియు కాపీరైట్ చట్టం క్రింద రిజిష్టర్ చేయబడినవి.

